క్లుప్తంగా

గోదాదేవికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో గోదాదేవి

డోన్: స్థానిక వేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీకాంత్‌శర్మ, రాము శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

26న శ్రీనివాస కల్యాణం

ఈనెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, రజనీబాయి, శ్రీనివాసరావ్ తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై పట్టణ పురవీధుల మీదుగా ఊరేగిస్తామన్నారు.

ముగిసిన సమ్మేటివ్‌-1 పరీక్షలు

కొలిమిగుండ్ల: ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మేటివ్‌-1 పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. గత సోమవారం గణితం పేపర్ లీకేజీ అయి సోషల్ మీడియాలో కనిపించడంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు పరీక్షను వాయిదా వేశారు. గణితం పరీక్షను చివరి రోజు నిర్వహించారు. పరీక్ష ప్రశ్నా పత్రాలు నంద్యాల నుంచి కొలిమిగుండ్ల పోలీస్‌స్టేషన్‌కు ఉదయం 7 గంటలకు రావడంతో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. గణితం పేపర్ లీకేజీ అయినప్పటి నుంచి రోజూ ఉపాధ్యాయులు పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలు తీసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది.

23 మద్యం బాటిళ్లు స్వాధీనం

కోవెలకుంట్ల: మండలంలోని పెద్దకొప్పెర్లకు చెందిన ఓ వ్యక్తి నుంచి పోలీసులు శుక్రవారం మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రేవనూరు ఎస్ఐ భూపాలుడు సమాచారం మేరకు..గ్రామానికి చెందిన సుబ్రమణ్యం బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశారు. అతని వద్ద నుంచి 23 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని మద్యం విక్రేతను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడికి సన్మానం


పోస్టు ప్రసాద్‌ను సత్కరిస్తున్న నాయకులు

డోన్: వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పోస్టుప్రసాద్‌ను శుక్రవారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి స్వగృహంలో పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడిగా పార్టీ అభ్యున్నతికి కృషి చేశారని పార్టీ నాయకుడు మహేంద్రనాయుడు ప్రశంసించారు. నాయకులు రైల్వే నాయుడు, వెంకటేష్, రమేష్‌నాయుడు, రాజేష్, రామానాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లె రూరల్: మండలంలోని పాతపాడు, పసుపల గ్రామాల్లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదన్నారు. రైతులకు వ్యవసాయానికి తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు.

బేతంచెర్లలో 5 గంటలు విద్యుత్ బంద్

బేతంచెర్ల: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం మినహా అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆ శాఖ ఏడీ మధుసూదన్‌రెడ్డి, రూరల్, టౌన్ ఏఈలు శ్రీనివాసులు, పుల్లయ్య తెలిపారు. రైతులు, పరిశ్రమలయజమానులు సహకరించాలని కోరారు.

కోవెలకుంట్లలో 4 గంటలు

కోవెలకుంట్ల: మండలంలోని కోవెలకుంట్ల, కలుగొట్ల, గుళ్లదూర్తి, దొర్నిపాడు విద్యుత్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ రామమోహన్ తెలిపారు. సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులను దృష్టిలో ఉంచుకుని ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డీలర్ నియామకాల నిలుపుదల

డోన్ రూరల్: మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల నియమాకాలను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తహసీల్దార్ కె.నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రకటన వచ్చే వరకు దరఖాస్తులు పంపరాదని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు.

క్రిస్మస్ సందడి

- ముస్తాబవుతున్న ప్రార్థనా మందిరాలు
- విద్యుత్ దీపాలతో చర్చీల అలంకరణ
- క్రిస్మస్‌తో పట్టణ, గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ


క్రిస్మస్ ట్రీలు



బనగానపల్లెలో క్రిస్మస్‌కు ముస్తాబవుతున్న సీఎస్ఐ టౌన్ చర్చి

బనగానపల్లె రూరల్: క్రిస్మస్ పండుగకు చర్చిలు ముస్తాబవుతున్నాయి. నాలుగు రోజుల్లో క్రిస్మస్ ఉండడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. చర్చిలతో పాటు క్రైస్తవుల ఇళ్ల వద్ద రంగురంగుల విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలు, స్టార్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పలు చర్చిలు, ప్రార్థనా మందిరాలను సుందరంగా అలంకరించారు. క్యాండిల్ లైట్ సర్వీస్‌లు జరుపుకుంటున్నారు. ప్రతి రోజు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.

జోరుగా విక్రయాలు

ఈ నెల 25న క్రిస్మస్ సందర్భంగా వివిధ కాలనీల్లో క్రైస్తవులు వారి స్థోమతను బట్టి స్టార్స్‌ను తమ ఇళ్లపై ఏర్పాటు చేసుకుంటున్నారు. బనగానపల్లె, కోవెలకుంట్ల పట్టణాల్లోని ఫ్యాన్సీ స్టోర్స్‌లలో స్టార్స్ సైజ్‌ను బట్టి రూ.200 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. అలాగే రూ.350 నుంచి రూ.1000 వరకు క్రిస్మస్ ట్రీ, శాంతక్లాజ్ దుస్తులు, రంగు రంగుల విద్యుత్ దీపాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. రెడీమెడ్ దుస్తుల దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి.

ప్రత్యేక ప్రార్థనలు

ఆయా చర్చీలకు చెందిన పాస్టర్లు క్యాండిల్ లైట్ సర్వీసులను నిర్వహిస్తూ భక్తుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రార్థనలను ఏర్పాటు చేసి దైవా సందేశాన్ని అందిస్తున్నారు. కొంత మంది ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి సపోస్ క్రిస్మస్, సెమి క్రిస్మస్ సంబరాలను జరుపుకుంటున్నారు.

ప్రత్యేక అలంకరణలో చర్చిలు

బనగానపల్లె నియోజకవర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, సంజామల మండలాల్లోని చర్చిలను క్రైస్తవులు అందంగా ముస్తాబు చేస్తున్నారు. పండుగ రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బనగానపల్లె పట్టణంలోని సీఎస్ఐ టౌన్ చర్చి, మదర్‌థెరిస్సా చర్చి, పెంతేకోస్తు చర్చి, హోసన్న, ఏసుకృపా ప్రార్థన మందిరాలతో పాటు మండల వ్యాప్తంగా సుమారు 30 వరకు క్రైస్తవ సంఘాలకు చెందిన చర్చిలు ఉన్నాయి. వీటిలో క్రిస్మస్ రోజున ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు.


శిలువ గుర్తుతో అలంకరణ


రంగురంగుల పేపర్లతో ముస్తాబు


విక్రయానికి ఉంచిన స్టార్లు

మద్యం విక్రేతల అరెస్ట్


సారా, కర్ణాటక మద్యాన్ని చూపిస్తున్న ఎక్సైజ్ సీఐ

డోన్ రూరల్: అక్రమంగా నాటుసారా, మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. డోన్, ప్యాపిలి మండలాల్లో దాడులు నిర్వహించామని తెలిపారు. డోన్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బోయ సురేష్, ప్యాపిలి మండలం డి.రంగాపురం గ్రామానికి చెందిన మేడసారి శివశంకర్‌ను అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి కర్ణాటక మద్యం 192 టెట్రా ప్యాకెట్లు, 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే 1800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి ఒక మోటర్ సైకిల్‌ను సీజ్ చేశామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుల్స్ రంగస్వామి, ఉమాకాంత్‌రెడ్డి ఉన్నారు.

25 లీటర్ల నాటుసారా స్వాధీనం

అవుకు: నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వర్ధనాదేవి తెలిపారు. అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో దాడులు నిర్వహించామన్నారు. అవుకు మండలం మంగంపేట తండాలో సారా బట్టీలను ధ్వంసం చేశామని తెలిపారు. 400 లీటర్ల బెల్లం ఊటను పారబోసి సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే కొలిమిగుండ్ల మండలానికి చెందిన ఉలువల రామలక్ష్మయ్య వద్ద 15 లీటర్ల నాటుసారా, నందిపల్లె గ్రామానికి చెందిన ముడావత్ నాయక్ వద్ద 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో బనగానపల్లె, కోవెలకుంట్ల ఎస్ఐలు కమలాకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వేడుకగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. సహస్ర దీపాలంకరణ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన


మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

బనగానపల్లె రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని రాష్ట్ర మాల మహానాడు ఉపాధ్యక్షుడు కేడం సుబ్బరాయుడు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై పార్లమెంట్‌లో చర్చించకపోయినా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏకసభ్య కమిషన్ వేశారన్నారు. కమిషన్‌ను ఉపసంహరించుకోవాలని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. మాలమహానాడు నాయకులు కె.విశ్వం, చిన్నారాయుడు, వెంకటేష్, జేమ్స్, భాస్కర్, చిన్ననాగరాజు, తిరుపాల్, శివ, ఖాసీం, చెన్నయ్య పాల్గొన్నారు.

బాలికకు డెంగీ లక్షణాలు


వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

కోవెలకుంట్ల: పట్టణంలోని సంతమార్కెట్ సమీపంలో నివాసం ఉంటున్న అక్బర్‌బాషా కుమార్తె షేక్ సనాకు డెంగీ లక్షణాలు బయటపడ్డాయి. బాలిక ఆళ్లగడ్డ నియోజకవర్గం శిరువెళ్లలోని మదరసాలో చదువుకుంటోంది. కొన్ని రోజుల నుంచి జ్వరం వస్తుండడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలికకు డెంగీ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు కాలనీని సందర్శించి బాలిక కుటుంబంతో పాటు చుట్టుపక్కల ఇళ్ల ఆవరణాలను పరిశీలించారు. దోమలు వ్యాప్తిం చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మాయలూరు పీహెచ్‌సీ డాక్టర్ రాబర్ట్‌కెన్నెడి, హెల్త్‌సూపర్‌వైజర్ మునిస్వామి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు ఉన్నారు.

కల్తీ మందులు విక్రయిస్తే చర్యలు


పురుగు మందులను పరిశీలిస్తున్న ఏఓ నిరంజన్

కోవెలకుంట్ల: రైతులకు కల్తీ పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి నిరంజన్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. క్రిమిసంహారక మందుల స్టాక్, అందుకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. పురుగు మందుల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం ధృవీకరించిన పురుగు మందులను మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. క్రిమి సంహారక మందులు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. అలాగే ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ, మినుము, వరి, జొన్న, తదితర పంటలకు ఈ నెలాఖరు వరకు పంటల బీమా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించిందన్నారు. ఇప్పటివరకు బీమా చేయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

నేడు స్వచ్ఛ కోవెలకుంట్లపై ర్యాలీ

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని స్వామినగర్, ఇందిరమ్మ కాలనీల్లో స్వచ్ఛ కోవెలకుంట్ల అనే కార్యక్రమంపై శనివారం ర్యాలీ నిర్వహించనున్నట్లు ఈఓ ప్రకాష్‌నాయుడు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, బహిరంగ మలవిసర్జన, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు.

నేడు వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్

డోన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్ తెలిపారు. బుగ్గన అర్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్, దివంగత రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నివాళి, ఆస్పత్రులు, ఆశ్రమాల్లో దుస్తులు, పండ్లు పంపిణీ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సోమేష్ యాదవ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, నాయకులు శేఖర్ యాదవ్, రఫీ, రైల్వే నాయుడు, వెంకటేష్, మహేంద్రనాయుడు పాల్గొన్నారు.

బనగానపల్లెలో..

బనగానపల్లె: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

కొలిమిగుండ్లలో..

కొలిమిగుండ్ల: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెడ్పీవైస్‌చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కటింగ్ జరుగుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పంట నమోదు తప్పనిసరి

బేతంచెర్ల: రబీ సీజన్‌లో వేసిన శనగ, జొన్న ఇతర పంటలకు ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. మండలంలో వివిధ పంటలు సాగు చేసిన రైతులు చాలా మంది ఇంకా పంట నమోదు చేసుకోలేదని చెప్పారు. నష్టపరిహారం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలు అందాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జున రెడ్డి సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ,జమ్మలమడుగు, బనగానపల్లె, తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, తదితర రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

కందుల కొనుగోలుకు ఏర్పాట్లు

ప్యాపిలి: నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయాధికారి రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సమీపంలోని రైతుసేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు తదితర జిరాక్స్ కాపీలతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు. ప్రతి రోజూ బహిరంగ మార్కెట్‌లో ఉన్న రేటుకు అనుగుణంగా కొనుగోలు ప్రక్రియ సాగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు రిజిస్ట్రేషన్ ముగిశాక తెలియజేస్తామన్నారు.

స్థానిక సమస్యలను పరిష్కరించాలి

ప్యాపిలి: గ్రామస్థాయిలోని సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ అన్నారు. మండల పరిధిలోని రాచర్ల గ్రామంలో శుక్రవారం సీపీఐ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో నామమాత్రంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు సదరు పరిశ్రమలు తగిన న్యాయం చేయడం లేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు సీపీఐలో చేరారు. పార్టీ నాయకులు వెంకటేశ్, వాసు, ఖాసీంవలి, ఇమ్రాన్ ఖాన్, దస్తగిరి పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

బనగానపల్లె రూరల్: డ్వాక్రా సంఘాల మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక పొదుపు భవనంలో డీఆర్‌డీఏ వెలుగు సిబ్బంది, డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ.. పొదుపు మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చిరు వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. అలాగే తీసుకున్న రుణాలను సకాలంలో బ్యాంకులకు చెల్లించాలని తెలిపారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలు క్రిస్మస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరైన సినీ నటుడు కేవీ ప్రదీప్

కోవెలకుంట్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించాలని సినీ యాక్టర్, మోటివేషన్ స్పీకర్ కేవీ ప్రదీప్ సూచించారు. పట్టణ శివారులోని జ్యోతి విద్యానికేతన్‌లో శుక్రవారం నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, పాఠశాల కరస్పాండెంట్ సవిత్‌నాథరెడ్డి, ప్రిన్సిపాల్ సింధూరి పాల్గొన్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..!


అవుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పేరుకుపోయిన చెత్త

అవుకు: మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చెత్త పేరుకుపోయింది. ఇక్కడికి రోజూ పదుల సంఖ్యలో ప్రజలు అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వస్తుంటారు. కార్యాలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే ఎటుచూసినా చెత్తే దర్శనమిస్తోంది. దుర్గంధం వ్యాపిస్తోంది.దీనికి తోడు గురువారం చెత్తలో పిల్లి కళేబరం ఉండడంతో కార్యాలయం చుట్టూ దుర్వాసనతో నిండిపోయింది. కంపు భరించలేక జనం ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో పరిస్థితి ఇలా ఉండేంటి, పరిసరాల పరిశుభ్రత ప్రజలకేనా.. ప్రభుత్వ అధికారులకు ఉండదా అంటూ జనం చర్చించుకున్నారు.

ఘనంగా తిరుచ్చి ఉత్సవం


స్వామివారిని పల్లకీపై ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ ఆలయమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో మార్గశిర మాసం శుక్రవారం రాత్రి స్వామి వారికి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ముందుగా స్వామివారికి విశేష పూజలు చేశారు. వివిధ పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులను చేశారు. మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ స్వామివారు ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితుడు కల్యాణ చక్రవర్తి, ఆలయ అర్చకులు మద్దిలేటిస్వామి, మనోహర్, నరసింహా ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

హిజ్రాలకూ సమాన హక్కులు

డోన్: ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా మిగతా వారితో సమాన హక్కులు ఉన్నాయనే సంగతిని విస్మరించరాదని సీఐ ఇంతియాజ్‌బాషా అన్నారు. స్థానిక హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శుక్రవారం ట్రాన్స్‌జెండర్ల సమావేశానికి సీఐతో పాటు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్స్ చట్టపరంగా తమకు లభించిన హక్కులను అనుభవించేందుకు కృషి చేయాలన్నారు. వ్యాపారాలు చేసుకునేందుకు ముందుకు వస్తే తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు మేనేజర్ మధుకుమార్, హిజ్రాల సంఘం నాయకులు తులసమ్మ, ముంతాజ్, సోని తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

వరి కోతల్లో కూలీలు



వరిమోపులను నూర్పిళ్లకు తీసుకెళ్తున్న కూలీలు



జోరుగా వరి కోతలు

బేతంచెర్ల: మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో బోరుబావుల కింద సాగు చేసిన వరి కోతదశకు రావడంతో పనులు ఊపందుకున్నాయి. గోర్లగుట్ట, యంబాయి, సీతారామాపురం, రహిమానుపురం, ఆర్‌యస్ రంగాపురం, గూటుపల్లె, అంబాపురం, బుగ్గానిపల్లె, ముద్దవరం గ్రామాల్లో వరి సాగు చేశారు. వారం రోజులుగా వరి కోత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలకు చేతినిండా పనులు దొరుకుతున్నాయి.